సాక్షి
ప్రకాశం

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



అధికారుల నిర్లక్ష్యం.. తుప్పపట్టిన లక్ష్యం

ఎస్సీ, బీసీ కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యానికి కోట్ల రూపాయల విలువైన వాహనాలు తుప్ప పట్టిపోతున్నాయి. - 8లో..



కాపుల గురించి మాట్లాడితే తీవ్ర పరిణామాలు

కాపుల గురించి ఎవరు మాట్లాడినా తీవ్ర పరిణామాలు ఉంటాయని కాపు సంఘ నేతలు హెచ్చరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం 36/26

వాతావరణం

ఎండ తీవ్రత పెరుగుతుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రి వేళ చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు 'వెలుగొండ'ను పరిశీలించనున్న మంత్రి నిమ్మల

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సోమవారం జిల్లాకు రానున్నారు. సోమవారం రాత్రి 8 గంటలకు విజయవాడలోని మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి 11.30 గంటలకు దోర్నాల చేరుకుంటారు. కొత్తూరులోని వెలిగొండ గెస్ట్ హౌస్‌లో రాత్రికి బస చేస్తారు. మరుసటి రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు బయలుదేరి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు టన్నెళ్ల వద్దకు చేరుకుంటారు. అనంతరం ఫీడర్ కెనాల్ పాయింట్ నుంచి మొదలుకొని కెనాల్ వెంట పర్యటిస్తారు. 11.45 గంటలకు జమ్మనపల్లి వద్ద ఉన్న గొట్టిపడియ డ్యామ్‌ను సందర్శిస్తారు. అక్కడ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. అనంతరం అక్కడే మీడియాతో మాట్లాడతారు. తరువాత మార్కాపురం నుంచి విజయవాడ క్యాంపు కార్యాలయానికి బయలుదేరి వెళతారు.

ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



పెన్షనర్ల సమస్యలపై సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌పీ శాస్త్రి

ఒంగోలు టౌన్: దేశంలో ఉన్న 75 లక్షల మంది ఈపీఎఫ్ పెన్షనర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌పీ శాస్త్రి డిమాండ్ చేశారు. యూటీఎఫ్ కార్యాలయంలో అసోసియేషన్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షనర్ల పట్ల రీజినల్ కార్యాలయాల్లో ఉన్న ఈపీఎఫ్ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈపీఎఫ్ పెన్షనర్లు ఎదుర్కొంటున్న చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రీజినల్ కార్యాలయాల్లో పెండింగులో ఉన్న ఫైళ్లన్నిటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అధికారుల పరిస్థితి మారకుంటే భవిష్యత్తులో ఉద్యమ కార్యాచరణకు పూనుకుంటామని హెచ్చరించారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ ఓపెన్ చేయాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లకు 12వ పీఆర్సీని ప్రకటించాలని, ఐఆర్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా నాయకులు జి.శేషయ్య, సీహెచ్ రాంబాబు, షేక్ హుసేన్, చంద్రమౌళి, యూఎస్ఎన్‌రెడ్డి, కేపీ కుమార్, ఎన్ రామకృష్ణారెడ్డి, ఎన్ హరిచంద్రారెడ్డి, ఎం.ఆదినారాయణ మూర్తి పాల్గొన్నారు.

డీఈఓకు ఏపీటీఎఫ్ నాయకుల అభినందన



సావనీరును బహూకరించిన ఏపీటీఎఫ్ నాయకులు

ఒంగోలు సిటీ: ఒంగోలు నూతన డీఈఓగా అత్తోట కిరణ్‌కుమార్‌ ను ఏపీటీఎఫ్ సంఘం పక్షాన రాష్ట్ర కార్యదర్శి కె.వి.జి.కీర్తి, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.అమ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.అశోక్‌కుమార్, జిల్లా కార్యదర్శులు కె.పెద్దన్న, ఎం.సురేష్‌బాబు, ఐఫియా కౌన్సిలర్ పి.వి.సుబ్బారావు ఆదివారం విద్యాశాఖ కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకొద్దామన్నారు. డీఈఓ కిరణ్‌కుమార్ త్వరలో అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించుదామన్నారు. అనంతరం డిప్యూటీ డీఈఓ సామా సుబ్బారావు, మార్కాపురం, కనిగిరి డివిజన్ల ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వరరావుకు 80 సంవత్సరాల ఓక్ మహాసభలు సావనీరును బహూకరించారు.

కూటమిలో కుంపట్లు



జిల్లా తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకుల మధ్య మాటల యుద్ధం సాగుతోంది. నీకు ఇంగితం లేదని ఒకరంటే నీకే ఇంగితం లేదని మరొకరు వాదులాడుకుంటున్నారు. మా రక్తం సలసలా మరిగిపోతుందని ఒకరంటే, మేమేం తక్కువ కాదు సహనం వహిస్తున్నామని మరొకరు చెబుతున్నారు. మొత్తం మీద మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని జనసేనలో చేర్చుకోవడంపై ఒకరి మీద మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలోనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి వ్యక్తిగత దూషణలకు దిగడం ఆ పార్టీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు.

- టీడీపీ, జనసేన నాయకుల మధ్య మాటల యుద్ధం
- నీకు ఇంగితం లేదంటే.. నీకే ఇంగితం లేదని పరస్పర విమర్శలు
- పవన్ కళ్యాణ్ ఇంగితం లేకుండా వ్యవహరించారని టీడీపీ నాయకుడి విమర్శ
- దామచర్ల ఇంగితమేమైందని అడిగావా అంటూ ఎత్తిపొడిచిన జనసేన నాయకుడు
- పవన్ కళ్యాణ్, బాలినేనిని ఏమైనా అంటే తరిమికొడతామని జనసేనల హెచ్చరిక

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

కూటమి పార్టీల నేతల మధ్య చిచ్చు రగులుతోంది. గత శుక్రవారం ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ఆ పార్టీకి చెందిన జిల్లా నాయకుడు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్య అనుచరుడు ఎద్దు శశిభూషణ్ చేసిన ప్రసంగం కూటమి పార్టీల్లో చిచ్చురేపింది. బహిరంగ వేదిక మీద నుంచి జనసేన అధినాయకుడు పవన్ కళ్యాణ్‌ను, ఇటీవలే ఆ పార్టీలో చేరిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని, ఆయన కుమారుడిని వాడు, వీడు అంటూ వ్యాఖ్యానించడం పెద్ద దుమారాన్ని రేపింది. పవన్ కళ్యాణ్‌ను ఉద్దేశించి వ్యక్తిగత దూషణలకు దిగడం, అదీ ఎమ్మెల్యే దామచర్ల సమక్షంలో జరగడం జనసేన నాయకులకు మింగుడు పడటం లేదు. కూటమి ప్రభుత్వంలో కీలకమైన ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకుడి మీదనే నేరుగా విమర్శలు చేయడంపై మండిపడుతున్నారు. ఒక ద్వితీయ శ్రేణి నాయకుడికి ఇంత ధైర్యం ఎక్కడిదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు జిల్లాలో ఏ నలుగురు కలిసినా ఇదే విషయం గురించి చర్చించుకోవడం కనిపిస్తోంది. కూటమిలో కుంపట్ల గురించి, టీడీపీ, జనసేన నాయకులు విమర్శలు, ప్రతి విమర్శలపై చర్చించుకుంటున్నారు.

పవన్ కళ్యాణ్‌కు ఇంగితం లేదు...

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటీవల జనసేన పార్టీలో చేరడం తెలిసిందే. ఆయనను పార్టీలో చేర్చుకోవడాన్ని తప్పు పడుతూ ఆ పార్టీ జిల్లా నాయకుడు ఎద్దు శశిభూషణ్ చేసిన ప్రసంగంలో నేరుగా పవన్ కళ్యాణ్ మీదనే విమర్శలు గుప్పించారు. తమతో సంప్రదించకుండానే బాలినేనిని పార్టీలో చేర్చుకున్నారని మండిపడిన ఆయన బాలినేని మెడలో జనసేన కండువా కప్పుతుంటే తమ రక్తం సలసలా మరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఏ మాత్రం ఇంగితం లేకుండా ప్రవర్తించాడని తీవ్రమైన దూషణలకు దిగారు. బాలినేని, ఆయన కొడుకు మాకు అజన్మాంతం శత్రువులేనని, జనసేనలోకి వచ్చి వారిప్పుడేం చేస్తారో చూస్తాం అంటూ రెచ్చిపోయాడు. ఇప్పుడే కాదు బాలినేని జనసేన పార్టీలోకి చేరడానికి రంగం సిద్ధం చేసుకున్న నేపథ్యంలో ఒంగోలు నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో కూడా ఇలాగే జరిగింది.

శశిభూషన్‌తో మాట్లాడించిందెవరు...

అయితే శశి భూషణ్ ఇలా మాట్లాడడం వెనక ఎవరున్నారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే దామచర్ల ఉద్దేశపూర్వకంగానే తన ముఖ్య అనుచరుడిచేత ఇలా మాట్లాడించినట్లు ప్రచారం సాగుతోంది. వైఎస్సార్ సీపీకి రాజీనామా చేసిన బాలినేని జనసేన పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించినప్పుడు కూడా దామచర్ల ఇలాంటి విమర్శలు చేయడాన్ని గుర్తు చేస్తున్నారు. తూర్పునాయుడు పాలెంలో జరిగిన సభలో మాట్లాడిన ఆయన జనసేలో చేరినప్పటికీ బాలినేనిని ఎవరూ రక్షించలేరని, సాక్షాత్తు పవన్ కళ్యాణ్ కూడా ఆయనను కాపాడలేడని వ్యాఖ్యానించడం గమనార్హం. అప్పుడు దామచర్ల చేసిన విమర్శలు సంచలనం సృష్టించాయి. అధిష్టానం వరకు వెళ్లాయి. దాంతో దామచర్లపై సీరియస్ అయిన అధిష్టానం జనసేన విషయంలో సంయమనం పాటించాలని హితవు చెప్పినట్లు సమాచారం. అయినప్పటికీ ఆయన తరచుగా కూటమి నాయకుడైన బాలినేనిపై విమర్శలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో తన అనుచరుడైన శశి భూషణ్ చేత విమర్శలు చేయించినట్లు తెలుస్తోంది. తాను నేరుగా మాట్లాడడం వలన కూటమి ఇబ్బందుల్లో పడుతుందన్న ఉద్దేశంతో కావాలనే తన అనుచరుల ద్వారా పవన్ కళ్యాణ్, బాలినేనిలపై తీవ్రమైన విమర్శలు చేయించినట్లు జనసేన కార్యకర్తలు, నాయకులు భావిస్తున్నారు.

మాకు చెప్పే తీసుకున్నారా..

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని తీసుకునే ముందు మాకు చెప్పలేదనడం సరికాదని జనసేన నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఒంగోలు మేయర్ గంగాడ సుజాతతో పాటుగా మరో 20 మందికి పైగా వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టీడీపీలోకి చేర్చుకున్నప్పుడు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ జనసేన నాయకులకు చెప్పే పార్టీలో చేర్చుకున్నారా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంలో దామచర్లకు ఇంగితం లేదని మేము చెప్పమని, కూటమి పెద్దలు తీసుకున్న నిర్ణయాలను విమర్శించడం పొత్తు ధర్మం కాదని వాదిస్తున్నారు.

వారించని దామచర్లపై అనుమానాలు...

టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో బహిరంగ వేదికపై నుంచి శశిభూషణ్ నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నప్పటికీ ఎమ్మెల్యే దామచర్ల వారించకపోవడం గమనార్హం. పైగా ఆ విమర్శలను వింటూ చిరునవ్వులు చిందించడంపై జనసేనలు మండిపడుతున్నాయి. కావాలనే బాలినేనిని అడ్డుపెట్టుకొని పవన్ కళ్యాణ్ మీద విమర్శలు చేయిస్తున్నారని, ఇప్పుడు కనుక ఊరుకుంటే ముస్ముందు మరింతగా నోరుపారేసుకుంటారని జనసేన నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని తమ నాయకుడు పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు.

ఇది పద్ధతికాదు దామచర్ల..

అయితే దామచర్ల ఒకటి అనుకుంటే జనసేన మరొక విధంగా స్పందించింది. జనసేన జిల్లా ప్రచార కమిటీ కో ఆర్డినేటర్ జడా నాగేంద్ర ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో దామచర్ల వైఖరిపై మండిపడ్డారు. మా నాయకుడిపై నీ అనుచరుడు బహిరంగ సభలో నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తుంటే నువ్వు చూస్తూ ఎలా ఉంటావని నిలదీశారు. గత నాలుగు నెలలుగా ఒంగోలులో ఎలాంటి దుర్మార్గాలు, దురాగతాలు జరుగుతున్నాయో మాకు తెలుసని, వీటిని చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని చెప్పారు. ఇప్పుడు రాష్ట్రమంతా ఒంగోలు వైపు చూస్తుందని, ఎమ్మెల్యే అజమాయిషీ బాగా లేదని అనుకుంటున్నారని అన్నారు. పవన్ కళ్యాణ్‌ను, బాలినేనిని ఎవరైనా ఏమైనా అంటే పిచ్చి కుక్కను కొట్టినట్లు తరిమి కొడతామని హెచ్చరించారు. స్థాయిని మరిచి మాట్లాడితే సహించేది లేదని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ ఖండించారు. పవన్ కళ్యాణ్‌కు ఇంగితం లేదని శశిభూషణ్ నోరుపారేసుకుంటుంటే అక్కడ వేదిక మీదే ఉన్న ఎమ్మెల్యే దామచర్ల వారించకపోవడాన్ని ఆ పార్టీ సెంట్రల్ ఆంధ్ర కమిటీ కన్వీనర్ చీకటి వంశీదీప్ తప్పుపట్టారు. కూటమిని ముంచాలన్న కుట్రతోనే ఇలాంటి విమర్శలు చేస్తున్నారని చెప్పారు. టీడీపీ నాయకులకు ఇంగిత జ్ఞానం లేదని జనసేన జిల్లా కార్యదర్శి లంకా నరసింహారావు బేస్తవారిపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దగ్గరుండి జనసేనపై విమర్శలు చేయించడం తగదని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

పేదల వైద్యంపై పచ్చవిషం



నిర్మాణంలో ఉన్న మెడికల్ కాలేజీ



జీజీహెచ్ వైద్యశాల

- మార్కాపురం మెడికల్ కాలేజీపై విషం చిమ్మిన కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే ప్రిన్సిపల్, జీజీహెచ్ సూపరింటెండెంట్‌లు బదిలీ
- నేడు సుమారు 35 మంది వైద్యనిపుణులకు కౌన్సెలింగ్
- ఇక మెరుగైన వైద్యం అందని ద్రాక్షే

మార్కాపురం: పశ్చిమ ప్రకాశం ప్రజల కలలపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విషం చిమ్మింది. మార్కాపురం మెడికల్ కాలేజీతో ఈ ప్రాంత ప్రజలు తమకు అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని, తమ పిల్లలు ఇక్కడే ఎంబీబీఎస్ సీట్లు తెచ్చుకుని డాక్టర్లు అవుతారని కన్న కలలన్నీ కల్లలయ్యాయి. ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో మార్కాపురం మెడికల్ కాలేజీని చేర్చకపోవడంతో అప్పుడే అందరికీ అనుమానాలు మొదలయ్యాయి. అయినా ఏదో ఒక మూల ఆశ. మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతుందని, వైద్యులందరూ ఇక్కడే ఉంటారని గత ప్రభుత్వంలో అందిన అత్యాధునిక వైద్యసేవలన్నీ ఈ ప్రభుత్వంలో కూడా అందుతాయని ఆశించారు. అందుకు విరుద్ధంగా మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలిపేసింది. మరో అడుగు ముందుకేసి ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ నాగరాజమన్నార్‌ను నెల్లూరుకు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీ సావిత్రిని ఏలూరు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌గా బదిలీ చేసింది. సుమారు 35 మంది వైద్య నిపుణులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఇక్కడ నుంచి మిగిలిన మెడికల్ కాలేజీలకు బదిలీ చేయనుంది. గత ప్రభుత్వంలో మొత్తం 75 మంది వైద్యులు ఉండి సేవలందించారు. సోమవారం జరిగే కౌన్సెలింగ్‌లో సుమారు 35 మంది వైద్య నిపుణులు వెళ్లిపోనున్నారు. ఇక మిగిలిన నర్సింగ్ స్టాఫ్ మరికొంత మంది వైద్య నిపుణులు కూడా బదిలీపై వెళ్లనున్నారు. దీంతో పశ్చిమ ప్రకాశంలోని ప్రజలకు 2014–2019 మధ్య అందిన అరకొర వైద్యసేవలే మళ్లీ దిక్కయ్యాయి. ప్రాణం మీదకు వస్తే గుంటూరు, ఒంగోలు లేదా కర్నూలు వెళ్లాల్సిన దయనీయ పరిస్థితులు కనిపించనున్నాయి. ఏది ఏమైనా కూటమి ప్రభుత్వ తీరుపై పశ్చిమ ప్రకాశం ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఇలా..

పశ్చిమ ప్రకాశంలోని సుమారు 8 లక్షల మంది ప్రజలకు అత్యాధునిక వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మార్కాపురానికి సుమారు రూ.475 కోట్లతో మెడికల్ కళాశాల మంజూరు చేశారు. 150 ఎంబీబీఎస్ సీట్లను దృష్టిలో ఉంచుకొని జీజీహెచ్ వైద్యశాల అభివృద్ధి పనులను, మెడికల్ కళాశాల నిర్మాణ పనులు చేపట్టారు. మార్కాపురం మండలం రాయవరం గ్రామం వద్ద 41.97 ఎకరాల విస్తీర్ణంలో మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు గత రెండేళ్లలో వేగంగా జరగడంతో దాదాపు 75 శాతం పనులు పూర్తయ్యాయి. సిబ్బంది క్వార్టర్స్, నర్సింగ్ కళాశాల, జంట్స్, లేడీస్ హాస్టల్స్, క్లాసు రూములు, సెంట్రల్ క్యాంటీన్ పూర్తయ్యాయి. కళాశాలలో విద్యుత్ వైరింగ్, ప్లంబింగ్ పనులు, రంగుల తోపాటు కొన్ని భవనాల నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉంది. ఇక జీజీహెచ్‌లో 450 బెడ్లను సిద్ధం చేశారు. జనరల్ సర్జరీల కోసం 100, జనరల్ మెడిసిన్ కోసం 100, ఆర్థోపెడిక్ విభాగానికి 40, ఆప్తమాలజీ 20, డెర్మటాలజీ 10, సైకియాట్రీ విభాగం 10, ఈఎన్‌టీకి 20, ఐసీయూ బెడ్లు 20, పీడియాట్రిక్స్ 50, ఓబీజీ (ప్రసూతి గైన కాలజీకి) 50 బెడ్లను కేటాయించారు. ప్రస్తుతం రోజుకు 500 నుంచి 600 మధ్య ఓపీ వస్తుంది. ఆరు నెలల వ్యవధిలో జీజీహెచ్‌లో అదనపు బెడ్లను ఏర్పాటు చేశారు. నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, దర్శి, కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం తదితర ప్రాంతాల నుంచి అనునిత్యం రోగులు వస్తున్నారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితి ఇదీ..

కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పనులు నత్త నడకతో పోటీపడగా ఒక్క వైద్యున్ని కూడా నియమించలేదు. దీంతో జూన్ 24న నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం మెడికల్ కాలేజీని, జీజీహెచ్‌ను సందర్శించి కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. అయితే ఆ నివేదికలో పూర్తిస్థాయిలో నిర్మాణాలు, జీజీహెచ్‌కు కావాల్సిన వైద్యులు లేరని పేర్కొనడంతో కేంద్రం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వలేదు. మళ్లీ ఇటీవల ఎన్ఎంసీ అధికారులు నూతన ప్రతిపాదనలు పంపాలని చెప్పడంతో హడావుడిగా కేంద్రానికి నివేదిక పంపారు. వర్చువల్ విధానంలో జీజీహెచ్‌ను పరిశీలించారు. 450 బెడ్లు ఉన్నాయనీ, 82 మంది ప్రొఫెసర్లు, అసిస్టెంటు ప్రొఫెసర్లు, డాక్టర్లు అందుబాటులో ఉన్నారని తెలిపారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఓసీ ఇవ్వకుండా పీపీపీ విధానంలో చేపట్టాలని నిర్ణయించింది. ఈ ప్రతిపాదనకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతోపాటు నీట్ కౌన్సెలింగ్‌లో మార్కాపురం మెడికల్ కాలేజీని చేర్చలేదు. నూతన ప్రభుత్వం రావడంతో పనులు మందగించాయి. ప్రస్తుతం ఈ ఏడాది వంద ఎంబీబీఎస్ సీట్లకైనా అనుమతి ఇవ్వాలని స్థానిక జీజీహెచ్ వైద్యాధికారులు ప్రభుత్వాన్ని కోరారు.

వెలుగొండ ప్రాజెక్టు సొరంగాల పరిశీలన



సొరంగ నిర్మాణాలు పరిశీలించిన ఉదయగిరి ప్రాజెక్టు సాధన సమితి సభ్యులు

- సొరంగ నిర్మాణాలను సందర్శించిన ప్రాజెక్టు సాధన సమితి సభ్యులు
- అధిక శాతం నిధులు కేటాయించి పనులను పూర్తి చేయాలని డిమాండ్

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కొత్తూరు వద్ద జరుగుతున్న వెలుగొండ ప్రాజెక్టు సొరంగ నిర్మాణ పనులను నెల్లూరు జిల్లా ఉదయగిరి వెలుగొండ ప్రాజెక్టు సాధన సమితి సభ్యులు ఆదివారం సందర్శించారు. తొలుత వెలుగొండ ప్రాజెక్టు రెండో సొరంగ నిర్మాణాలను పరిశీలించారు. ప్రాజెక్టు వివరాలను మేనేజర్ రాంబాబును అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టును సందర్శించిన ఉదయగిరి ప్రాజెక్టు సాధన సమితి సభ్యులు డాక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం మన రాష్ట్ర బడ్జెట్ రూ.2 లక్షల కోట్లు కాగా అందులో కేవలం 0.5 నిధులను వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించిన భూనిర్వాసితులకు అందిస్తే వెలిగొండ ప్రాజెక్టు ద్వారా నీటిని నల్లమల సాగర్‌కు వదులుకోవచ్చన్నారు. కృష్ణా, గుంటూరు జిల్లాలతో సమానంగా వెనుకబడిన ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాలపై కూడా దృష్టి సారించాలన్నారు. ఈ మూడు జిల్లాల్లోని 29 మండలాల్లో లక్షల ఎకరాలకు సాగు నీరు, 15 లక్షల మందికి తాగునీరు అందించే అతి ముఖ్యమైన ప్రాజెక్టు వెలిగొండ ప్రాజెక్టు అని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్యాంప్రసాద్, సాగునీటి నిపుణులు నారాయణరెడ్డి, సమాజ సేవకులు వెంగళరావు, వెంకటయ్య, సీనియర్ నాయకులు దస్తగిరి అహమ్మద్, సీనియర్ యూటీఎఫ్ నాయకులు మాలకొండారెడ్డి, గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మహిళా నాయకురాలు నాగమణి, జన విజ్ఞాన వేదిక నాయకురాలు కొండమ్మ, ధనుంజయ్, సీపీఐ మండల నాయకులు తిరుపతయ్య తదితరుల పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రతపై 104 ఉద్యోగుల ఆందోళన



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

పొదిలి: రాష్ట్రంలో 104 వాహనాల ద్వారా వైద్య సేవలందిస్తున్న ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం సీఐటీయూ అనుబంధ విభాగం 104 యూనియన్ జిల్లా సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఏ.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్య సేవలు అంటేనే ప్రశాంతంగా చేయాల్సి ఉందన్నారు. ఈ క్రమంలో ఉద్యోగులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ మార్పిడి తరువాత ఉద్యోగ భద్రత కోసం ప్రతి ఒక్కరిలోనూ ఆందోళన నెలకొందన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు, అరబిందో బకాయిలు, ఇతర సమస్యలపై సమావేశంలో చర్చించారు. చర్చించిన అంశాలను, సమస్యలను రాష్ట్ర కమిటీకి పంపిస్తున్నామన్నారు. రాష్ట్ర కమిటీ భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తుందన్నారు. వారి ఆదేశాలను పాటించేందుకు సంఘీభావంగా ఉండేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని కలిసి తమ సమస్యలను తెలియచేస్తామని చెప్పారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి కె.రవివర్మ, కోశాధికారి పి.శ్రీధర్‌రెడ్డి, కన్వీనర్ జి.నరేంద్ర, పి.సుబ్బయ్య, ఏ.శ్రీకాంత్, ఉదయ భాస్కర్, జే.వెంకటేశ్వర్లు, 104 డీఈఓలు, డ్రైవర్లు పాల్గొన్నారు.

10న విశ్వబ్రాహ్మణ కార్తీక వన సమారాధన

ఒంగోలు మెట్రో: ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 10వ తేదీ ఆదివారం 30వ కార్తీక వన సమారాధన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రావూరి లక్ష్మయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం సాయంత్రం భాగ్యనగర్ లోని రిటైర్డ్ ఎంప్లాయిస్ బిల్డింగ్ లో కార్తీక వన సమారాధన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ నవంబర్ 10న దక్షిణ బైపాస్ రోడ్డులోని కాఫీ బార్ పక్క సందులో ఉన్న విశ్వబ్రాహ్మణ నూతన కళ్యాణ మండపంలో కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం కార్తీక పూజా కార్యక్రమం, అల్పాహారం, జెండా ఆవిష్కరణ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గౌరవాధ్యక్షుడు డాక్టర్ వీరబ్రహ్మాచార్యులు ప్రధాన కార్యదర్శి నూతక్కి మల్లేశ్వరరావు కోశాధికారి రంగు రంగనాయకులు వర్కింగ్ ప్రెసిడెంట్ సానల విశ్వరూపచారి, ఉపాధ్యక్షుడు చామర్తి బొలానంద ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



కార్తీక సమారాధన బ్రోచర్ ను ఆవిష్కరిస్తున్న రిటైర్డ్ ఎంపాయీస్ సభ్యులు

క్లుప్తంగా

గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతి


మృతిచెందిన యాచకుడు

మద్దిపాడు:గుర్తు తెలియని వాహనం ఢీకొని యాచకుడు మృతిచెందిన సంఘటన ఆదివారం ఉదయం మద్దిపాడు మండలంలోని కొస్టాల సెంటర్ సమీపంలో ఉన్న పెట్రోల్ బంక్ ఎదురుగా జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. కొన్ని రోజులుగా కొస్టాల సెంటర్‌లోని పలు దుకాణాల వద్ద ఒక యాచకుడు జీవిస్తున్నాడు. ఆదివారం రోడ్డుకు తూర్పువైపునకు వెళ్లగా, అక్కడి వారు అతన్ని రోడ్డు దాటించి ఇళ్లవైపు పంపారు. కానీ, ఆ యాచకుడు మళ్లీ రోడ్డు దాటుతున్న క్రమంలో ఒంగోలు నుంచి విజయవాడ వైపు వెళ్లే దారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మద్దిపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కి పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాచకుడి వివరాలు తెలుసుకునేందుకు విచారిస్తున్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

గిద్దలూరు రూరల్: ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆదివారం గిద్దలూరు పట్టణంలోని నల్లబండబజారులో జరిగింది. ఓబులేసు అనే యువకుడు మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలు

దొనకొండ: రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన దొనకొండ మండలంలోని వద్దిపాడు గ్రామ రోడ్డుపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. వద్దిపాడు వెంకటాపురం ఎస్సీకాలనీకి చెందిన శ్రీరామ్ కిరణ్‌బాబు, రాహేలమ్మ దంపతులు ద్విచక్ర వాహనంపై వ్యక్తిగత పనుల నిమిత్తం దర్శి వెళ్తున్నారు. వద్దిపాడు నుంచి సంగాపురం వైపు వెళ్తున్న ఆటో ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో కిరణ్‌బాబుకు కుడి కాలు విరిగిపోగా, రాహేలమ్మ తలకు తీవ్ర గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

కొత్తపట్నం: బాలిక అదృశ్యం కావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్తపట్నం మండలం పాదర్తి గ్రామానికి చెందిన ఓ బాలిక ఈ నెల 26వ తేదీ నుంచి కనిపించడం లేదు. గ్రామంలోనే నివాసం ఉంటుండగా, బాలిక తల్లి పదేళ్ల క్రితం పిడుగుపడి చనిపోయింది. అప్పటి నుంచి మేనత్త జయలక్ష్మి ఇంట్లో ఉంటూ బాలిక చదువుకుంటోంది. మేనత్త ఈ నెల 26వ తేదీ ఉదయం గుడికెళ్లి ఇంటికొచ్చే సరికి బాలిక ఇంట్లో లేకపోవడంతో బంధువులను ఆరా తీశారు. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జయలక్ష్మి ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్సై సుధాకర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మూడు గ్రానైట్ లారీల పట్టివేత

ఒంగోలు సిటీ: పాలిష్డ్ బ్లాక్ గెలాక్సీ గ్రానైట్‌ను అక్రమంగా హైదరాబాదువైపు తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు మైనింగ్ డీడీ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. ఒంగోలు మైనింగ్ విజిలెన్స్ అధికారులు ఖనిజ రవాణా వాహనాలు తనిఖీ చేస్తుండగా ఎటువంటి రాయల్టీ అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న రెండు లారీలు పట్టుబడినట్లు చెప్పారు. అందులో ఒక వాహనాన్ని పొదిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించగా, మరో వాహనాన్ని చీమకుర్తిలో భద్రత నిమిత్తం ఉంచినట్లు వెల్లడించారు. అదేవిధంగా ప్రాంతీయ నిఘా విభాగం విజిలెన్స్ అధికారులు గెలాక్సీ గ్రానైట్ బ్లాక్‌ను అక్రమంగా తరలిస్తున్న ఒక లారీని సీజ్ చేసి మద్దిపాడు పోలీస్‌స్టేషన్‌లో భద్రత నిమిత్తం ఉంచినట్లు తెలిపారు. గ్రానైట్ శ్లాబ్‌లుగానీ, ముడి గ్రానైట్ బ్లాక్స్‌గానీ, అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రాజశేఖర్ హెచ్చరించారు.

30న జాబ్ మేళా

ఒంగోలు వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ కొండపి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జే రవితేజ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాలో డీమార్ట్, ఫ్లిప్ కార్ట్, డైకిన్ సంస్థలు పాల్గొంటున్నాయన్నారు. జాబ్ మేళాలకు 19 నుంచి 30 సంవత్సరాల మధ్య గల టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమా పూర్తి చేసిన నిరుద్యోగ యువత అర్హులన్నారు. ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.14,000 నుంచి రూ.25 వేల వరకు జీతం ఇవ్వనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ఎం.గోపీకృష్ణ (8897964505)ను సంప్రదించాలని సూచించారు.

అధికారుల నిర్లక్ష్యం..

తుప్పపట్టిన లక్ష్యం..!

- ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల అధికారుల అలసత్వానికి కోట్ల రూపాయలు వృథా
- లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు కాలువలు శుభ్రం చేసే మిషన్లు, వాహనాలు కొనుగోలు
- బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తెప్పల కొనుగోలు
- 2018–19 ఆర్థిక సంవత్సరంలో మంజూరు
- పంపిణీ చేయకుండా వదిలేయడంతో తుప్పపట్టి పాడైపోయిన వైనం
- లబ్ధిదారులకు శాపం.. నీరుగారిన లక్ష్యం


ప్రగతి భవన్ ఆవరణలో ఇటీవల కురిసిన వర్షం నీటిలో నానుతున్న కాలువలు శుభ్రం చేసే మిషన్లు, ట్రాలీలు

ఒంగోలు వన్‌టౌన్: అధికారులు, పాలకుల అలసత్వం కారణంగా పేదలకు మేలు చేసేందుకు ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల లక్ష్యం నెరవేరడం లేదు. లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరకపోగా, కోట్ల రూపాయల నిధులు వృథా అవుతున్నాయి. ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్లలో అదే జరిగింది. 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఎన్నికలకు ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం హడావిడిగా ఓట్ల కోసం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి కొన్ని యూనిట్లు మంజూరు చేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 56 మండలాల్లో మండలానికి ఒకరు చొప్పున 56 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కాలువలు శుభ్రం చేసే మిషన్లు, వాటికి ట్రక్కులు కొనుగోలు చేశారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ ద్వారా ఒక్కో యూనిట్ విలువ రూ.15 లక్షలుగా నిర్ణయించి లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేశారు. మండలంలోని గ్రామాల్లో కాలువలను శుభ్రం చేసేందుకు వినియోగించేందుకు మొత్తం రూ.8.4 కోట్లతో ఎస్సీ కార్పొరేషన్ అధికారులు వీటిని కొనుగోలు చేశారు. టెండర్ దక్కించుకున్న ఏజెన్సీకి ప్రభుత్వం నగదు కూడా చెల్లించింది. మొత్తం 56 యూనిట్లలో 28 యూనిట్లను ఏజెన్సీ అందజేయగా, వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మిగిలిన 28 యూనిట్లలో కొన్నింటికి ట్రాలీలు మినహా ఇంజిన్లు ఇవ్వకపోవడం, ట్రాలీలను కూడా మొత్తం ఇవ్వకపోవడం కారణంగా అవన్నీ నేటికీ స్థానిక ప్రగతి భవన్ ఆవరణలో ఉండిపోయాయి. అప్పటి అధికారులు, పాలకులతో పాటు ఆ తర్వాత వచ్చిన అధికారులు కూడా పట్టించుకోకపోవడంతో లబ్ధిదారులకు పంపిణీ చేయకుండా ఉండిపోయిన ట్రాలీలు, ఇంజిన్లు, మిషన్లు ఐదేళ్లుగా ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ పూర్తిగా తుప్పుపట్టి పాడైపోయాయి. దీనివలన సుమారు 4.2 కోట్ల రూపాయల నష్టం వాటిల్లింది.

కమీషన్ల కోసం ముందుగానే కొనుగోలు చేసినట్లు ఆరోపణలు...

ఆనాటి ఎస్సీ కార్పొరేషన్ అధికారులు కేవలం కమీషన్ల కోసమే లబ్ధిదారులకు పంపిణీ చేసే ట్రాలీ, ఇంజిన్లను ముందుగానే కొనుగోలు చేసి చివరకు పంపిణీ చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ రకమైన యంత్ర పరికరాలతో ఎటువంటి ఉపయోగం లేదని కొందరు లబ్ధిదారులు ముందుకు రాలేదని, ఆ విషయం అధికారులకు తెలిసినప్పటికీ లబ్ధిదారులతో సంబంధం లేకుండా ముందుగానే వాటిని కొనుగోలు చేసి తమ కమీషన్ల కోసం కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని ఆరోపణలు ఉన్నాయి.

ఆదరణ పథకాన్నీ ఆదరించని బీసీ కార్పొరేషన్ అధికారులు...

- రూ.4 లక్షల ప్రజాధనం దుర్వినియోగం

ఎస్సీ కార్పొరేషన్ అధికారుల కంటే తామేం తక్కువ కాదన్నట్టుగా బీసీ కార్పొరేషన్ అధికారులు వ్యవహరించారు. 2018–19లోనే బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న ఆదరణ పథకానికి ఎంపికైన లబ్ధిదారుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించారు. 2019 ఎన్నికలకు ముందు హడావిడిగా బీసీ కార్పొరేషన్ అధికారులు కూడా కమీషన్లకు కక్కుర్తిపడి ఆదరణ పథకం లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ముందుగానే తెప్పలు కొనుగోలు చేశారు. నదుల్లో చేపలు వేటాడేందుకు మత్స్యకారులకు ఉపయోగపడే తెప్పలకు సంబంధించి ఒక్కో యూనిట్ విలువ రూ.20 వేలు కాగా, 90 శాతం సబ్సిడీపోను ఒక్కో తెప్పకు లబ్ధిదారులు కేవలం రెండు వేల రూపాయలు మాత్రమే చెల్లించాల్సి ఉంది. అంత తక్కువ చెల్లించి యూనిట్లు పొందేందుకు లబ్ధిదారులు ముందుకొచ్చే అవకాశం ఉన్నప్పటికీ.. లబ్ధిదారులను ఎంపిక చేసి యూనిట్లు మంజూరు చేయడంలో ఆనాటి బీసీ కార్పొరేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఫలితంగా మొత్తం 20 తెప్పలు నేటికీ ప్రగతి భవన్ ఆవరణలోనే ఉన్నాయి. ఐదేళ్లు కావస్తుండటంతో తుప్పుపట్టి ఎందుకూ పనికిరాకుండా పోయాయి. 4 లక్షల రూపాయల నిధులు వృథా అయ్యాయి.


తుప్పపట్టి చిల్లులు పడి పనికిరాకుండా పోయిన తెప్పలు

అధికారుల అనాలోచిత నిర్ణయమే కారణం...

జిల్లాలో సముద్రతీర ప్రాంతం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మత్స్యకారులకు బోట్ల అవసరం అధికంగా ఉంది. కానీ, బీసీ కార్పొరేషన్ అధికారులు ఆ ఆలోచన లేకుండా బోట్లకు బదులుగా తెప్పల యూనిట్లపై దృష్టి సారించారు. తెప్పలతో సముద్రంలోకి వెళ్తే మునిగిపోతామని మత్స్యకార లబ్ధిదారులెవరూ వాటి కోసం ముందుకు రాలేదు. నదుల్లో చేపల వేట సాగించే వారు జిల్లాలో తక్కువగా ఉండటంతో తెప్పల అవసరం లేకుండా పోయింది. తెప్పల అవసరం ఉన్న లబ్ధిదారులను ఎంపిక చేయకుండానే బీసీ కార్పొరేషన్ అధికారులు వాటిని కొనుగోలు చేయడంతో నిరుపయోగంగా మారి 4 లక్షల రూపాయల ప్రజాధనం దుర్వినియోగమైంది.

> **లబ్ధిదారులు ముందుకు రాలేదు :**
> యంత్ర పరికరాలు కొనుగోలు చేసిన తర్వాత లబ్ధిదారులు ముందుకు రాకపోవడంతో అవన్నీ ప్రగతి భవన్‌లో అలాగే ఉన్నాయి. అప్పటి అధికారుల హయాంలో అదంతా జరిగింది.
> కె.అర్జున్ నాయక్, ఈడీ, ఎస్సీ కార్పొరేషన్

వైభవంగా జెడ్పీ హైస్కూల్ వజ్రోత్సవాలు


వజ్రోత్సవ స్థూపాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే కందుల


భారీగా హాజరైన పూర్వ, ప్రస్తుత విద్యార్థులు, గ్రామస్తులు

తర్లుపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసి 75 వసంతాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం వజ్రోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరై వజ్రోత్సవ స్థూపాన్ని ఆవిష్కరించి బాలబాలికల భోజనశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైస్కూల్ వజ్రోత్సవాల్లో తాము కూడా భాగమైనందుకు సంతోషంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు రూ.50 లక్షలకు పైగా విరాళంగా అందించి పాఠశాలను అభివృద్ధి చేయడం అభినందించదగిన విషయమన్నారు. వెనుకబడిన ప్రాంతమైన తర్లుపాడును అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ముఖ్యంగా తర్లుపాడు జెడ్పీ హైస్కూల్లో జూనియర్ కాలేజీని వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలను పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ముందుగా తుమ్మలచెరువులోని ఖాశీంస్వామి దర్గాను సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెన్నా ఇందిర, ఎంపీపీ భూలక్ష్మి, సర్పంచ్ పి.వరాలు, ఎంపీటీసీ అంకమ్మ, కోఆప్షన్ సభ్యులు అక్బర్‌అలీ, మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, పాఠశాల చైర్మన్ రాజారామిరెడ్డి, జనసేన ఇన్‌చార్జి ఇమ్మడికాశీనాథ్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌ఎం సుధాకర్, విద్యార్థుల కమిటీ చైర్మన్ జగన్‌బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం భోజనంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల స్థల దాతలైన నేరెళ్లి వంశస్తులు, దాతలను పాఠశాల కమిటీ, ఎంపీ, ఎమ్మెల్యేలు సన్మానించి మెమొంటోలు అందజేశారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


నూర్‌మహమ్మద్ జనాజా మోస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రోడ్డు ప్రమాదంతో పాటు అనారోగ్యంతో మృతి చెందిన వారి కుటుంబాలను యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆదివారం పరామర్శించారు. శనివారం రాత్రి స్థానిక మార్కాపురం రోడ్డులోని పెట్రోల్ బంకు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నూర్ మహమ్మద్, అఫ్రోజ్‌బేగ్, మండలంలోని కొలుకుల గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన ఎం.మరియమ్మ కుటుంబాలను ఆయన పరామర్శించారు. మృతులు నూర్ మహమ్మద్, అఫ్రోజ్‌బేగ్‌ల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను ఓదార్చారు. నూర్ మహమ్మద్ అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే.. మృతుడిని ఖబరస్థాన్‌కు తరలించే సమయంలో పెద్ద మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని జనాజా (పాడె) మోశారు. కొలుకులలో మృతిచెందిన మరియమ్మ మృతదేహానికి పూలమాల వేసి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

కాపుల గురించి మాట్లాడితే తీవ్ర పరిణామాలు

- కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు సంజీవకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సంజీవకుమార్

ఒంగోలు వన్‌టౌన్: కాపుల గురించి ఎవరు మాట్లాడినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రకాశం జిల్లా కాపు సంఘ అధ్యక్షుడు కె.సంజీవకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కాపు సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు సమక్షంలోనే ఎద్దు శశికాంత్‌భూషణ్ కాపుల గురించి, కాపులకు ఇచ్చే నామినేటెడ్ పదవుల గురించి మాట్లాడిన మాటలను కాపు సంఘం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఎమ్మెల్యే పక్కనే ఉండి కూడా శశికాంత్‌ను ఆపకపోవడం దారుణమని అన్నారు. శశికాంత్ ఏ అధికారంతో, ఎవరి అండతో కాపులకు ఇచ్చే పదవుల గురించి మాట్లాడారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటు కోసం కాపులు ఓట్లేసి గెలిపించారని తెలిపారు. గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి తన కోసం కష్టపడిన సింగరాజు వెంకట్రావు కుటుంబానికి ఒడా చైర్మన్ పదవి ఇచ్చారన్నారు. అలాంటిది మీ గెలుపు కోసం కష్టపడిన కాపులను గుర్తించి పదవి ఇవ్వాలన్నారు. సమావేశంలో కాపు సంఘ నాయకులు టి.శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఎస్.సాంబయ్య, వి.ఆంజనేయులు, ఐ.గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కాపు కార్తీక వనభోజన కమిటీని 9 టీమ్‌లు, 36 మంది సభ్యులతో ఆహ్వాన కమిటీలను ఏర్పాటు చేశారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, తదితరులు

ఇంకొల్లు జెడ్పీటీసీ సభ్యురాలు భవనం శ్రీలక్ష్మి, భవనం శ్రీనివాసరెడ్డి దంపతుల కుమారుడు అచ్యుత్‌రెడ్డికి, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, నాగలక్ష్మి దంపతుల కుమార్తె రమ్యశ్రీకి ఒంగోలు బృందావనం కళ్యాణ వేదికలో ఆదివారం జరిగిన వివాహానికి పలువురు ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కరణం బలరాం, వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల పార్లమెంట్ పరిశీలకుడు మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణయాదవ్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, నాయకులు పాల్గొని అచ్యుత్‌రెడ్డి, రమ్యశ్రీలను ఆశీర్వదించారు. – ఒంగోలు సిటీ

కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

చినగంజాం: పంట కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. చినగంజాం ఎస్సై ఎస్.రమేష్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గొనసపూడి సమీపంలో కొమ్మమూరు కాలువలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకొచ్చింది. గ్రామ ప్రజలు పరిశీలించి స్థానికుడు కాదని గుర్తించారు. మృతుడి వయసు సుమారు 40 నుంచి 45 ఏళ్లు ఉంటుంది. తెలుపు రంగు పొడుగు చేతుల చొక్కా ధరించి ఉన్నాడు. ఎవరైనా గుర్తిస్తే 9121102149, 9121102140 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గ్రానైట్ టిప్పర్ కిందపడి నుజ్జయిన కాళ్లు

- ఒక కాలును మోకాలి వరకు తొలగించిన వైద్యులు
- మరో కాలికి శస్త్ర చికిత్స, పరిస్థితి విషమం

కనిగిరి రూరల్: గ్రావెల్ మట్టి తోలే టిప్పర్, గ్రానైట్ రాళ్లు తోలే టిప్పర్ల మధ్య నలిగి కొనంకి రమణయ్య అనే వ్యక్తి రెండు కాళ్లు చితికిపోయాయి. కనిగిరి మండలం పునుగోడుకు చెందిన రమణయ్య శనివారం రాత్రి ఓ వివాహ వేడుకలో పాల్గొని బైక్‌పై తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. గార్లపేట రోడ్డులోని వాగు సమీపంలో గల ఫ్యాక్టరీల దగ్గర ఆగి ఉన్న రెండు లారీల మధ్యలో నుంచి వెళ్తుండగా, ఆ రెండు లారీలను ఒక్కసారిగా కదిలించారు. దీంతో రెండు లారీల మధ్య నలిగిన రమణయ్య అదుపుతప్పి కిందపడ్డాడు. అతని రెండు కాళ్ల మీద నుంచి గ్రానైట్ టిప్పర్ చక్రాలు వెళ్లడంతో నుజ్జునుజ్జయ్యాయి. ఒక కాలును మోకాలి వరకూ తొలగించగా, మరో కాలికి ఆపరేషన్ చేశారు. ఒంగోలులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

కంభం: స్థానిక హైవేకు ఆనుకుని ఓ గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను ఆదివారం రాత్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కంభం ఎస్సై బి.నరసింహారావు తనిఖీలు నిర్వహించగా, సుమారు రూ.3.50 లక్షల విలువ చేసే దీపావళి టపాసులు పట్టుబడ్డాయి. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరో నాలుగు రోజుల్లో దీపావళి పండుగ ఉండగా, రెండు రోజుల్లో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బాణసంచా మొత్తాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, తాను అమ్ముకోవడానికి అనుమతులు తీసుకోవడం జరిగిందని బాధితుడు శ్రీనివాసరెడ్డి వాపోయాడు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు పెద్దదోర్నాల విద్యార్థి


హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో మౌర్య చంద్ర సిద్దార్థ

పెద్దదోర్నాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మౌర్య చంద్ర సిద్దార్థ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 25వ తేదీ కందుకూరులో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో హైజంప్‌లో ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు మౌర్య చంద్ర సిద్దార్థ ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం నారాయణరెడ్డి తెలిపారు. నవంబర్ 3, 4 తేదీల్లో శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. హెచ్‌ఎంతో పాటు ఫిజికల్ డైరెక్టర్లు రామానాయక్, హెచ్.రామానాయక్, యోగా మాస్టర్ మహేశ్వరరెడ్డి, స్టాఫ్ సెక్రటరీ నాగమూర్తి, విజయ మాణిక్యం, అనసూయ దేవి, కిరణ్‌కుమార్, మీటేనాయక్, పోలయ్య, వెంకట శివకుమారి, చంద్రమౌళి, శిరీషరాణి, ఆంజనేయులు, ఆవులయ్య తదితరులు మౌర్య చంద్ర సిద్దార్థకు అభినందనలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి


లక్ష్మీనరసయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పామూరు:రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. పామూరుకు చెందిన ఆర్.లక్ష్మీనరసయ్య (35) వైఎస్సార్ జిల్లా బద్వేల్ వద్ద 10 రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతని బ్రెయిన్ డెడ్ అయింది. తిరుపతిలోని వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆయన మరణించగా, ఆదివారం భౌతిక కాయాన్ని పామూరు తరలించారు. ఆయనకు వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, గుత్తి వెంకటరాజా, ఓగూరి ఏడుకొండలు, నరసింహారావు, వరికూటి నరసింహారావు తదితరులు ఘనంగా నివాళులర్పించారు. మృతునికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.